నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 30 మే 2025 | NIZAMABAD

ప్రజల్లో భద్రతాభావం పెంపొందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ జితేందర్

- నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం అందేలా చూడాలి
- రాష్ట్ర డీజీపీ జితేందర్

కామారెడ్డి, మే 27 : ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. గురువారం ఆయన కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రజలు తాము సురక్షితంగా ఉన్నామనే భావన కలిగేలా పోలీసులు పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలని, తద్వారా వారి సమస్యలకు పరిష్కార మార్గాలు చూపడమే కాకుండా నేరాలను కూడా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి కేసులో సమర్థవంతమైన, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నప్పుడే ప్రజల నమ్మకాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. హైవే అథారిటీ, రవాణా శాఖతో సమన్వయం చేసుకుంటూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తరచూ ప్రాపర్టీ నేరాలకు పాల్పడే వారే మళ్లీ నేరాలు చేస్తున్నారని, అలాంటివారిపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. అనంతరం డీజీపీ జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. సమావేశంలో ఐపీఎస్ మల్టీ జోన్ -1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, నిజామాబాద్ సీపీ సాయి చైతన్య, కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి, అదనపు ఎస్పీ అడ్మిన్ నరసింహారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన డీజీపీకి ఎస్పీ రాజేశ్‌చంద్ర పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

త్వరలోనే జొన్నల డబ్బులు

- రైతుల ఖాతాల్లో 15 రోజుల్లో జమ చేస్తాం
- ఆందోళన చెందవద్దని మార్క్‌ఫెడ్ అధికారుల సూచన

నిజామాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జొన్న కొనుగోళ్లకు సంబంధించిన డబ్బులను త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టం చేశారు. జొన్న రైతులకు బకాయిలు పేరుకుపోవడంతో నమస్తే తెలంగాణ దినపత్రికలో 'జొన్న బకాయిలు రూ.100కోట్లు' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. నెల రోజులు దాటుతున్నా జొన్నలు విక్రయించిన రైతులకు నయా పైసా చెల్లింపులు జరగలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకు రాగా మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ మహేశ్ కుమార్ గౌడ్ వివరణ ఇచ్చారు. 15 రోజుల్లో జొన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 12,139 మంది రైతుల నుంచి 31, 593 మెట్రిక్ టన్నుల జొన్నలు సేకరించినట్లు తెలిపారు.

రాజీవ్ యువ వికాసానికి పెద్దసంఖ్యలో దరఖాస్తులు



అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే అర్హుల ఎంపిక

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి రాజీవ్ యువ వికాసం అర్హులను ఎంపిక పూర్తిచేస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగానే వేగంగా దరఖాస్తులను స్వీకరించగా.. యువత నుంచి భారీ స్పందన వచ్చింది. దరఖాస్తులు లక్షకుపైగా రాగా యూనిట్లు మాత్రం వేలల్లోనే మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఎవరికి యూనిట్లు మంజూరు అవుతాయో? ఎవరికి మొండిచేయి దక్కుతుందో? తెలియడం లేదు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని దరఖాస్తుదారులు కోరుకుంటున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక మాదిరిగానే రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే కొనసాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూనిట్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా నిజమైన అర్హులకు అందించాలని డిమాండ్ వినిపిస్తోంది. దరఖాస్తులు పెద్ద సంఖ్యలో రావడంతో అధికార యంత్రాంగం తలలు పట్టుకుంటున్నది. జూన్ 2 నాటికి కొద్ది మందికి మంజూరు పత్రాలు అందించి ఆ తర్వాత మంజూరైన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని యంత్రాంగం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది.

- మొత్తం టార్గెట్ యూనిట్లు 35,732 మాత్రమే...
- జనాభా ప్రాతిపదికన ఆయా మండలాలకు కేటాయింపు
- ఒక్కో యూనిట్‌కు ఐదుగురి వరకు పోటీ
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత
- సిబిల్ స్కోర్ మెలికపై దరఖాస్తుదారుల్లో తీవ్ర అనుమానాలు

లక్ష దరఖాస్తులు.. వేలల్లో యూనిట్లు!

యువత వికాసం చెందేనా?

నిజామాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నియామకాలపై అంతగా దృష్టి సారించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చేపట్టిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తిచేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఉద్యోగాలు సాధించిన వారికి నియామకపత్రాలను అందజేసింది. డీఎస్సీ తప్ప కొత్తగా ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో నిరుద్యోగ యువతను మచ్చిక చేసుకునేందుకు రాజీవ్ యువ వికాసం పేరుతో ఓ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. స్వయం ఉపాధి అవకాశాలు, సొంత వ్యాపారాలు అభివృద్ధి చేసుకునేందుకు దరఖాస్తులు కోరగా ఉమ్మడి జిల్లాలో లక్షా 3వేల 558 మంది ఉత్సాహం చూపారు. జనాభా ప్రాతిపదికన 35వేల 732 యూనిట్లు లక్ష్యంగా కేటాయించారు. ఈ లెక్కన ఒక్కో యూనిట్‌కు గరిష్ఠంగా ముగ్గురు నుంచి ఐదుగురి వరకు ఆయా మండలాల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పోటీ ఏర్పడింది. జిల్లాలకు కేటాయించిన యూనిట్లను జనాభాను ఆధారంగా చేసుకుని ఆయా మండలాలకు కేటాయించారు. రాయితీతో కూడిన రుణాలు ఇస్తామని చెప్పడంతో యువత పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకోగా సిబిల్ పేరుతో సర్కారు కొత్త నిబంధన తెరమీదికి తీసుకు రావడంతో ఆశావహుల్లో గుబులు మొదలైంది. సిబిల్ స్కోర్‌ను బూచీగా చూపితే చాలా మంది అనర్హులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

యూనిట్లకు పోటాపోటీ...

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక, ఆర్థిక సాయం, రుణాలు ఇప్పించడం, రాయితీల కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కన్వీనర్‌గా, ఆయా శాఖల అధికారులు, బ్యాంక్ అధికారులు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీవో కన్వీనర్‌గా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖ అధికారులు, సభ్యులుగా మండల పరిధిలోని బ్యాంక్ అధికారులు ఉంటారు. మున్సిపల్ పరిధిలో కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకంలో మొదటగా వితంతువులు, ఒంటరి మహిళలు, నిరుద్యోగులు, దివ్యాంగులు, నిరుద్యోగులకు యూనిట్ల మంజూరుకు ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియలను ఈ నెలాఖరులోనే పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్పింది. రాష్ట్రావతరణ దినోత్సవం నాటికి మంజూరు పత్రాలు అందించనున్నారు.

ఉమ్మడి జిల్లాకు కేటాయించిన యూనిట్ల వివరాలు

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 22,285 యూనిట్లు కేటాయించారు. దరఖాస్తులు 58వేల 896 వచ్చాయి. ఇందులో ఎస్సీలకు 5,817, ఎస్టీలకు 3,088, బీసీలకు 7,969, మైనార్టీ 2,911, క్రిస్టియన్ 174, ఇతరులకు 2,326 యూనిట్లు కేటాయించారు. కామారెడ్డి జిల్లాలో 13వేల 447 యూనిట్లు రాగా దరఖాస్తులు 44వేల 662 వచ్చాయి. ఎస్సీలకు 4,104, ఎస్టీలకు 2,356, బీసీలకు 4,698, మైనార్టీ 973, ఇతరులకు 1,272 యూనిట్లు కేటాయించారు. వచ్చిన దరఖాస్తులను మండలంలో ఉన్న జనాభా, యూనిట్లు, ఆ మండల పరిధిలో ఉన్న బ్యాంక్ శాఖలకు అనుగుణంగా బ్యాంక్‌లకు కేటాయిస్తున్నారు.

బాల్కొండలో అరాచక పాలన

బీఆర్ఎస్ నేతకు నోటీసులపై ముప్కాల్ పోలీసుస్టేషన్ ముట్టడి

ముప్కాల్ పోలీసుస్టేషన్‌కు తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తారా..
- పోలీసు అక్రమ నిర్బంధాలకు భయపడేదిలేదు..
- సునీల్‌రెడ్డి అరాచకాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం..
- గులాబీ శ్రేణుల స్పష్టీకరణ

ముప్కాల్, మే 29: అటు రాష్ట్రంలో ఇటు బాల్కొండ నియోజకవర్గంలో అరాచక, నియంత పాలన కొనసాగుతున్నదని డీసీసీబీ డైరెక్టర్, బీఆర్ఎస్ మెండోరా మండల అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ముప్కాల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగు నర్సయ్య..కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతోపాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి అక్రమాలపై సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నించారు. దీంతో నర్సయ్యకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీనిని నిరసిస్తూ, నర్సయ్యకు మద్దతు తెలియజేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు గురువారం ముప్కాల్ పోలీసుస్టేషన్ ముట్టడించాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మెండోరా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ నాయకులు,కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని మండిపడ్డారు.

అక్రమాలను బయటపెట్టినందుకే అక్రమ కేసులు

అధికారాన్ని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి చేస్తున్న అక్రమాలు, ఆగడాలను ఎత్తి చూపుతున్న జోగు నర్సయ్యపై కేసులు పెట్టి, పోలీసుస్టేషన్‌కు రావాలని వేధిస్తున్నారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రశ్నించినవారిపై అకారణంగా కేసులు పెడుతూ పోలీసుస్టేషన్‌కు ఎందుకు పిలిపిస్తున్నారని ఎస్సైని అడిగితే, కేసు పెట్టిన కాంగ్రెస్‌వాళ్లను అడిగిచెబుతామని సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. గతంలో సునీల్‌రెడ్డి..మాజీ మంత్రి వేములతోపాటు ఆయన కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేశారని, తాము ఇలా వ్యవహరించలేదని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ ఇక్కడి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రూ. వందల కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసులు..ప్రశ్నిస్తున్న తమపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

ఇండ్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నరు..

రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయాల్సి ఉండగా, కాంగ్రెస్ నాయకులు ఇంట్లో కూర్చొని ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా డబ్బులు కూడా వసూలు చేస్తున్నారని అన్నారు. తాము ప్రశ్నిస్తే జీర్ణించుకోలేక అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, సక్రమంగా రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే, కక్ష పెంచుకుంటున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే హక్కులేదా అని ప్రశ్నించారు. మాది ప్రజాపాలన అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ కక్షపూరిత రాజకీయాలు చేయడమేనా ప్రజాపాలన అని నిలదీశారు. కేసులకు, పోలీసుల బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులెవరూ భయపడరన్నా రు. ఎన్ని కేసులు పెట్టి నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు అయ్యేదాకా కాంగ్రెస్ నాయకులను ప్రజాకోర్టులో ఎండగడుతూనే ఉంటామని వారు స్పష్టం చేశారు.

జీలుగ విత్తనాల కోసం రైతుల ఆందోళన

అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న రైతులు

అరకొర సరఫరాపై అధికారులతో వాగ్వాదం

కామారెడ్డి రూరల్ , మే 29: జీలుగ విత్తనాల కోసం రైతులు ఆందోళన చేపట్టారు. సరిపడా పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయక పోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి మండలం ఇస్రోజివాడి రైతు వేదికలో గురువారం సబ్సిడీపై జీలుగ, పెద్దజనుము విత్తనాలు పంపిణీ చేపట్టారు. విత్తనాలు సగం మంది రైతులకే రావడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకొర విత్తనాలను తెప్పించి రైతులను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మండలంలో సాగు భూములు, రైతుల వివరాలు మీకు తెలియవా? అని ప్రశ్నించారు. వెంటనే విత్తనాలు తెప్పించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో విత్తనాలు తెప్పిస్తామని అధికారులు చెప్పడంతో రైతులు శాంతించారు.

అమెరికాలో కామారెడ్డివాసి మృతి

స్వగ్రామం తిమ్మారెడ్డిలో విషాద ఛాయలు

గోవర్ధన్ (ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, మే 29: ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబీకులు శోకసంద్రంలో మునగగా.. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీ డైరెక్టర్, తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన గూల విఠల్‌కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు లండన్‌లో ఉంటున్నాడు. చిన్న కుమారుడు గూల గోవర్ధన్ (27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం రెండున్నరేండ్ల క్రితం అమెరికా వెళ్లాడు. గూల గోవర్ధన్ ఈ నెల 27న మృతి చెందినట్లు సమాచారం కుటుంబీకులు వచ్చింది. దీంతో కుటుంబీకులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అయితే గోవర్ధన్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నీటి కుంటలో పడి బాలుడు మృతి

మాచారెడ్డి మండలం కొత్తపల్లిలో ఘటన

యశ్వంత్ (ఫైల్)

కామారెడ్డి, మే 29 : సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఓ బాలుడు ఆడుకుంటూ వెళ్లి నీటి కుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మాచారెడ్డి మండలం కొత్తపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకోగా..గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన సందీప్-శ్రీలత దంపతులకు రెండో కుమారుడైన యశ్వంత్ (4) రెండు రోజుల క్రితం అమ్మమ్మ బరిగె నర్సవ్వ గ్రామమైన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం కొత్తపల్లికి వచ్చాడు. బుధవారం ఇంటి బయట ఆడుకుంటూ ఉండగా నీటి కుంటలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గ్రామానికి చేరుకొని గుండెలవిసేలా రోదించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.